అన్నదాత కష్టం.. అడవి ఆవుల పరం

- అడవి ఆవుల దెబ్బకు కంటిమీద కునుకు కరువు
- రాత్రిళ్లు వరికుప్పలను నాశనం చేస్తున్న వైనం
- ఆవుల బారినుంచి కుప్పలను కాపాడుకునే పనిలో రైతన్నలు


ముత్తాయపాలెంలో అడవి ఆవులు నాశనం చేయటంతో కుప్పచుట్టూ పడిపోయిన ధాన్యం

బాపట్ల: అడవి ఆవులు వరికుప్పలపై పడి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రాత్రికి రాత్రే అడవిలో నుంచి వరిపొలాల్లోకి వచ్చి కుప్పలు వేసిన వరిపంటను దూసి ధాన్యం తింటూ వరికుప్పలను నాశనం చేస్తున్నాయి. ఆవుల బారి నుంచి కుప్పలను కాపాడుకోవడం ఆయా ప్రాంతాల్లోని రైతులకు కష్టతరంగా మారింది. ప్రతిరోజూ అడవిలో నుంచి సుమారు 20 నుంచి 50 ఆవుల వరకు వచ్చి కుప్పలపై పడుతున్నాయి. కుప్పల్లోని గడ్డిమొత్తాన్ని దూసి ధాన్యం తినడంతోపాటు కుప్పలను కాళ్లతో తొక్కుతు నాశనం చేస్తున్నాయి. దీంతో ఆవుల పడిన కుప్పల వద్ద రైతులు వెళ్లి చూస్తే 3 బస్తాల వరకు ధాన్యం భూమి పాలు అవుతోంది. సుమారు రెండు బస్తాల మేర ధాన్యం ఆవులు తిని తిరిగి అడవికి వెళ్తున్నాయి. దీంతో వాటిని అరికట్టడం రైతులకు పెనుసవాల్‌గా మారింది.

అడవి నుంచి తీర ప్రాంతాల్లోకి...

బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం మండలాల్లో అటవీ భూమి అధికంగా ఉండటం వలన తీరప్రాంత గ్రామాల్లోని ఆవులు అడవిలో ఉంటూ రాత్రిళ్లు పొలాల్లోకి వచ్చి వాటిని నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలైన బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం, పిన్నిబోయినవారిపాలెం, కొత్తమద్దిబోయినవారిపాలెం, మద్దిబోయినవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, అసోదివారిపాలెం గ్రామలతోపాటు కర్లపాలెం మండలంలోని పేరలి, తుమ్మలపల్లి, సమ్మెటవారిపాలెం, శీలంవారిపాలెం, కప్పలవారిపాలెం గ్రామాల్లోని పొలాలను ఆవులు నాశనం చేస్తున్నాయి.

రాత్రికి రాత్రే నాశనం చేశాయి



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాను. నారు వేసినప్పటికీ నుంచి పొలానికి కాపలా కాసుకుంటూనే ఉన్నాను. పైరు పొట్టదశలో ఒక్కసారి అడవి ఆవులు చేలో పడి తిన్నాయి. మళ్లీ ఎరువులు, పురుగుమందులు వేసుకొని పైరును కాపాడుకున్నాను. ప్రస్తుతం వరికుప్పపై పడి నాశనం చేశాయి. సుమారు 5 బస్తాల మేర ధాన్యం నష్టం చేశాయి.

– దండ్రుప్రోలు సూర్యనారాయణ, రైతు, మద్దిబోయినవారి పాలెం

రైతులకు తిప్పలు..

వీటి బారినుంచి పంటను కాపాడుకునేందుకు రేయింబవళ్లు రైతులు కాపాల కాసుకోవాల్సి వస్తుంది. కొందరు రైతులు కాపలవాళ్లను నియమించుకుంటూకాపాడుకుంటుండగా, మరికొందరు కుప్పలను కాపాడుకునేందుకు వాటి చుట్టు పట్టలు, ముళ్ల కంచెలను వలయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ



బాపట్ల: వైద్య రంగంలో టెక్నీషియన్ల పాత్ర కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో శనివారం జరిగింది. ఈసమావేశంలో డాక్టర్ విజయమ్మ పాల్గొని మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్లు వైద్య పరీక్షలు సకాలంలో చేయటం వల్లే వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు.

ఈసందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌బయ్యా, ప్రధాన కార్యదర్శి కూరపాటి సత్యంరాజు, ట్రెజరర్ హరిచందన, ఆర్గనైజింగ్ సెక్రటరీ బడుగు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం



కర్లపాలెం: శ్రీమహాశాస్త స్వామి అయ్యప్ప ఆలయంలో మాలధారులైన భక్తులకు గత 41రోజులుగా జరుగుతున్న సద్ది పంపిణీ(అన్నదానం) కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వేగేశన నరేంద్రవర్మరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారుగా 5 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మనోవికాసానికి అంగన్‌వాడీలు దోహదం



రేపల్లె రూరల్: చిన్నారుల మనోవికాసంపై అంగన్‌వాడీలు ప్రత్యేక దృష్టిసారించి ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నారని సీడీపీఓ ఎం.సుచరిత అన్నారు. పూర్వప్రాథమిక విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని 5, 6 వార్డులలో నిర్వహించిన ప్రదర్శన వేడుకల్లో ఆమె మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యంతో పాటు వారి వికాసాభివృద్ధికి అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. వీరి ఆరోగ్య వివరాలను సైతం నిత్యం రికార్డులలో నమోదు చేయటం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులచే సంఖ్యాజ్ఞానం, సృజనాత్మక అంశాల కార్యక్రమాలను ప్రదర్శింపజేశారు. అంకెలతో ఆటలు, అంకెలతో కూడిన అభినయ గేయాలు చెప్పించటం, మార్కెట్‌లో కూరగాయలు కొంటున్నట్లు తదితర అంశాలపై చిన్నారులు చేసిన అభినయం పలువురిని ఆకట్టుకుంది. సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలలు బడిలోనే ఉండేలా చర్యలు




వేమూరు: బాలలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ బాలల సమస్యలను గుర్తించి, పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. చుండూరు సీఐ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.మాధవి, వి.అమృతవాణి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ట్ మేనేజరు ఎం.శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

సీఐటీయూ నేత శామ్యూల్ మృతికి నివాళి

కర్లపాలెం: సీఐటీయూ నేత కామ్రేడ్ శామ్యూల్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. ఈనెల 2వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ 3వ తేదీన మృతిచెందిన శ్యామ్యూల్ అంత్యక్రియలు శనివారం స్వగ్రామం పేరలిపాడులో ఘనంగా జరిగాయి. తొలుత శామ్యూల్ ఇంటి వద్ద జరిగిన సంతాప సభలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని శ్యామ్యూల్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బాపట్ల ఆర్టీసీ డిపో డీఎం శ్రీమన్నారాయణ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు మణిలాల్, మజుంధర్, కృష్ణమోహన్, శరత్, కుమార్, బాబూరావు, సుధాకర్, కొండయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఒకేషనల్ టూర్



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఒకేషనల్ టూర్ నిర్వహించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ సందర్శనకు తీసుకెళ్లారు. ఒకేషనల్ టీచర్ ఝాన్సీ మాట్లాడుతూ హెచ్‌ఎం కె.ఆంటోని రాజు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. యూనివర్శిటీలో ఎల్రక్టానిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఇతర విషయాలను వర్సిటీ యాజమాన్యం వివరించిందని చెప్పారు. ఒకేషనల్ టీచర్ సరోజ పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ


అద్దేపల్లిలో దివ్యాంగ చిన్నారులను సన్మానిస్తున్న ఎంఈఓ దేవరాజు, ఉపాధ్యాయులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి లూయి బ్రెయిలీ అని ఎంఈవో నీలం దేవరాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశనుసారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాన్ భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతుల మధ్య శనివారం లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేవరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులైన చిన్నారులతో లూయి బ్రెయిలీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వీట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. దృష్టి లోపం కలిగిన విద్యార్థులను గుర్తించి సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం కాండ్రు హవీలా ప్రశాంతి, శ్రీలత, భువనేశ్వరి, సునీత, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఐఈఆర్టీలు మేరీ ఇవాంజలిన్, రత్నాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

నగరం: మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 233 అర్జీలు రాగా వాటిలో 101 పరిష్కరించినట్లు తహసీల్దార్ నాంచారయ్య తెలిపారు. నగరంలో శనివారం జరిగిన రెవెన్యూ ముగింపు సదస్సులో పాల్గొని మాట్లాడారు. గతనెల 6వతేదీ నుంచి మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూసమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూపరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సభలు చక్కని వేదిక అని మండల స్పెషల్ ఆఫీసర్ శంకర్‌బాబు అన్నారు. రేపల్లె, బేతపూడి గ్రామాలలో శనివారం నిర్వహించిన రెవిన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 18 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొరిగపూడి(భట్టిప్రోలు): గ్రామాల్లో రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం భట్టిప్రోలు మండలం గొరిగపూడి లో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సులో 12 అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ ఫణి కుమార్,జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో వెల్లటూరు విద్యార్థి ప్రతిభ


డీఈఓ పురుషోత్తం చేతుల మీదగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి సురేష్ బాబు

భట్టిప్రోలు: బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి దున్నా సురేష్‌బాబు క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించాడు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఏపీసీఓ నాగిరెడ్డి, చేతుల మీదగా సర్టిఫికెట్, బహుమతిని అందుకున్నాడు. అలాగే వ్యక్తిగత విభాగంలో సైన్స్ ఫెయిర్‌లో కూడా సురేష్‌బాబు తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, రెడ్డి సుధాకర్, వి.శ్రీనివాసరావు, సుభానీలను ఎంఈఓలు పులి లాజర్, నీలం దేవరాజ్, హెచ్‌ఎం కె. అరుణకుమారిలు శనివారం హైస్కూల్‌లో అభినందించారు. ఉపాధ్యాయులు ఎస్టేట్ బాబు, శివరామకృష్ణ, రామారావు, శైలజ, ఆషాలత పాల్గొన్నారు.

వాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలి

సీఐ మహ్మద్ జానీ


హెల్మెట్ ధరించినవారికి పూలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న సీఐ మహ్మద్‌జానీ

బాపట్ల: హెల్మెట్ ధరించి ప్రయాణం చేయటం వలన ప్రాణాలకు రక్షణ కలుగుతుందని బాపట్ల పట్టణ సీఐ మహ్మద్‌జానీ పేర్కొన్నారు. శనివారం హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న వారికి పూలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈసందర్భంగా సీఐ మహ్మద్‌జానీ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణించటం చాలా ప్రమాదకరమన్నారు. వాహనచోదకులంతా తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు విక్టర్, మాణిక్యరావు, సిబ్బంది ఉన్నారు.

నిర్ణీత వ్యవధిలో పారిశుద్ధ్య పనులు పూర్తి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

తెనాలి: పారిశుద్ధ్య పనులు నిర్ణీత వ్యవధిలో కచ్చితంగా అమలుకావాల్సిందేనని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ స్పష్టంచేశారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పథకంలో భాగంగా గత రెండురోజులుగా పట్టణ 35, 36 వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను చైర్‌పర్సన్ ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి శనివారం పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్లు గొడవర్తి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పట్టణ ప్రణాళిక అధికారి సాంబశివరావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్, ఏఈ జానీబాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు
- వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


పథకం ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


పిట్టలవానిపాలెం జూనియర్ కళాశాలలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

వేమూరు: ఇంటర్మీడియెట్ విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతుందని, అదే విధంగా జూనియర్ కళాశాలల్లో సైతం ప్రారంభించామన్నారు. మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుశీల, జొన్నలగడ్డ విజయబాబు, తూనుగుంట్ల సాయిబాబు, ఊస రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కనపర్తి నిరీక్షణరావు తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

కర్లపాలెం: ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టిందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. పిట్టలవానిపాలెం జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు ప్రారంభించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



చుండూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన చుండూరు గ్రామానికి చెందిన తాడిబోయిన శ్రీనివాసరావు శనివారం చెరుకుపల్లిలోని స్వగృహంలో వరికూటి అశోక్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మినుము పంటకు నిప్పుపెట్టిన ఆగంతకులు



బాపట్ల: బాపట్ల మండలం ఈతేరులో గుర్తు తెలియని వ్యక్తులు మినుము పంటకు నిప్పు పెట్టారు. పంట మొత్తం కాలి బూడిద అవటంతో రైతులు శ్రీనివాసరావు, లక్ష్మీ కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ చర్యకు పాల్పడింది ఎవరనే విషయం తెలియరాలేదు. మొత్తం 8 ఎకరాల్లో మినుము పంట మొత్తం కాలి బూడిదయింది. ప్రమాదవశాత్తు జరిగిందా? గుర్తుతెలియని వ్యక్తులు ఈ చర్యకు పాల్పడ్డారా అనే విషయం తెలియాల్సి ఉంది. కళ్లముందే కాలి బూడిదైన మినుము పంటను చూసి రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు తెలియాల్సిఉంది.

ద్విచక్ర వాహనం చోరీ

గుంటూరు రూరల్: ఇంటిముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన ప్రత్తిపాడు మండలం యనమదలలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. యనమదల కొండ్రుపాడు డొంక వైపున ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం వెనుక ఉన్న ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు రాత్రి సమయంలో చోరీ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ఇంటిముందు ఉంచిన వాహనాన్ని తీసుకెళ్లారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి ఇంటిలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాల మేరకు దుండగులు ఎటువెళ్లారు, అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మేజర్ కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



ఫిరంగిపురం: మండల పరిధిలోని సాగర్ కాలువ గుర్రపు డెక్కను డీసీ 13 చైర్మన్ నల్లజర్ల రవికుమార్ చొరవతో పొక్లెయిన్ ద్వారా శనివారం తొలగించారు. పనులను చైర్మన్ ప్రారంభించారు. మేడికొండూరు డీసీ పరిధిలోని 39ఆర్ చిరుమామిళ్ల మేజర్ 39బీఎల్ మైనర్ కాలువ కింద బేతపూడి, వేమవరం, 113 తాళ్లూరు, కండ్రిక, నుదురుపాడు వరకు ఆరు కిలోమీటర్ల వరకు గుర్రపు డెక్కతో ఆయకట్టు రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సుందరరావు, అప్పయ్య, చెక్కా హనుమంతురావు, అంచుల శంకరరావు, వెంకటేశ్వర్లు, ఐదు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి బస్సులు ఏర్పాటు


సూరేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు

భట్టిప్రోలు: హైందవ శంఖారావం సభకు భట్టిప్రోలు మండలం నుంచి 8 బస్సులు ఏర్పాటు చేసినట్లు సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు తెలిపారు. భట్టిప్రోలు నుంచి 5, కోనేటిపురం, తాతావారిపాలెం, ఐలవరం గ్రామాల నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి..

బాపట్ల: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరగనున్న రాష్ట్రస్థాయి హైందవ శంఖారావం సభను విజయవంతం చేసేందుకు భారీగా తరలిరావాలని బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాళం నరేష్ పేర్కొన్నారు. ఈమేరకు హైందవ శంఖారావం కరపత్రాలను శనివారం విడుదల చేశారు. నాళం నరేష్ మాట్లాడుతూ ఏడులక్షల మందితో ఈ సభను విజయవంతం చేయాలని సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు బాపట్ల నుంచి ఉచిత బస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మామిడి రమేష్, బాల నారాయణ, బొమ్మిశెట్టి ప్రసాద్, బాలాజీ, ఇమ్మడిశెట్టి రాము, కొండ సూర్య, బూర్ల రత్తయ్య, బండ్రెడ్డి రజిని, నరాలశెట్టి శ్రీనివాస్, పువ్వాడ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

7,8,10 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ శాఖకు సంబంధించి అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్, రిటైల్ సప్లయి టారిఫ్‌ల పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టనుందని తెనాలి విద్యుత్ శాఖ ఈఈ వీవీ. చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఎ–కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంటలవరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారని వివరించారు. అలానే 10వ తేదీన కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు. తమ అభిప్రాయాలను తెలియజేయాలనుకున్న వినియోగదారులు ముందుగా తమ పేర్లను www.aperc.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ తెనాలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో జరుగుతుందన్నారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా దోస్త్ ఓపెన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటలు, మహిళలకు ముగ్గుల పోటీలను ఎస్ఐ వెంకటరవి ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.